www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024 5

పశ్చిమ గోదావరి



వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని ఆచంట, వల్లూరు, కరుగోరుమిల్లి, ఆచంట వేమవరం గ్రామాలకు చెందిన సుమారు 300 మంది వాలంటీర్లు రాజీనామాలు చేస్తూ లేఖలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందించారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ టిడిపి కూటమి చేష్టలతో విసుగు చెందిన తాము రాజీనామాలు చేశామని చెప్పారు.

పెనుగొండ : మండలంలో 75 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని ఎంపిడిఒ శ్రీనివాస్‌దొర తెలిపారు. ఈ మేరకు బుధవారం వారి రాజీనామా పత్రాలను అందించారని చెప్పారు.

ఆకివీడు : మండలంలో తొమ్మిది మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ తెలిపారు. ఆకివీడు-2 సచివాలయ పరిధిలో ఏడుగురు, ఆకివీడు-3 సచివాలయ పరిధిలో ఇద్దరు వాలంటీర్లు రాజీనామా చేశారని ఆయన తెలిపారు.


రావాల్సింది రూ.69 కోట్లు.. వచ్చింది రూ.45 కోట్లే..!

అరకొరగా పెన్షన్ సొమ్ము విడుదల

యూనియన్ బ్యాంకుకు ఆర్‌బిఐ నుంచి విడుదల కాని సొమ్ము

జిల్లావ్యాప్తంగా మొదటి రోజు 30 శాతం మాత్రమే పంపిణీ పూర్తి

ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల వద్ద పింఛనుదారుల అవస్థలు



ఉండిలో పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల వేళ పింఛన్ల పంపిణీ రాజకీయం పులుముకుంది. అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీలు పెన్షన్ల పంపిణీని పూర్తి రాజకీయంగా మార్చేశారు. దీనికితోడు ఎన్నికల సంఘం ఆదేశాలు వెరసి పింఛన్‌దారులకు తిప్పలు తప్పలేదు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా సొమ్ము అందుకునే పింఛన్‌దారులు మూడు రోజులైనా చేతికి అందక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పింఛన్ల పంపిణీ పని నుంచి వాలంటీర్లను పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. నడవలేని వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే పెన్షన్లు అందించాలని, మిగిలిన వారికి సచివాలయాల వద్ద పెన్షన్లు అందించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆపై ఈ నెల మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తారని ప్రకటించారు. జిల్లాలో వృద్ధాప్య, వికలాంగులు, వితంతు పెన్షన్లతోపాటు 23 రకాల పెన్షన్లకు సంబంధించి రెండు లక్షల 34 వేల 884 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతినెలా జిల్లావ్యాప్తంగా రూ.68.92 కోట్ల సొమ్ము లబ్ధిదారులకు పెన్షన్ రూపంలో అందించాల్సి ఉంది. అయితే కేవలం రూ.45.37 కోట్లు మాత్రమే సొమ్ము విడుదలైంది. మిగిలిన రూ.24 కోట్లు విడుదల కావాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నం నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి జిల్లాలో ఉన్న బ్యాంకులకు పెన్షన్ సొమ్ము జమైంది. అయితే పెన్షన్‌దారులు మాత్రం ఉదయమే సచివాలయాల వద్ద పెన్షన్ సొమ్ము కోసం బారులుదీరారు. సొమ్ము మాత్రం మధ్యాహ్నం నుంచి బ్యాంకులకు రావడంతో సచివాలయ సిబ్బంది బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీంతో వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. అదే క్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెన్షన్‌దారులు తల్లడిల్లారు. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల 34,884 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉంటే బుధవారం రాత్రికి కేవలం 68,103 మందికి రూ.20 కోట్లు మాత్రమే సొమ్ము అందించారు. జిల్లావ్యాప్తంగా 30 శాతం మాత్రమే పంపిణీ పూర్తయ్యింది.

యూనియన్ బ్యాంకులకు జమకాని సొమ్ము

జిల్లాలో యూనియన్ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి పెన్షన్ సొమ్ము జమ కాలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎస్‌బిఐకు సొమ్ము జమ కాలేదు. తర్వాత ఆర్‌బిఐ నుంచి సొమ్ము జమైంది. యూనియన్ బ్యాంక్‌కైతే పెన్షన్ సొమ్ము ఆర్‌బిఐ నుంచి జమ కాలేదు. మిగిలిన అన్ని బ్యాంకులకూ పెన్షన్ సొమ్ము జమైంది. పెన్షన్ సొమ్ముకు సంబంధించి యూనియన్ బ్యాంక్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ ఆర్‌బిఐ నుంచి అనుమతులు రాకపోవడంతో సొమ్ము జమ కాలే దని తెలిసింది. సాంకేతిక లోపం కారణంగా ఇబ్బందులు ఏర్పడి ఉండొచ్చని ఒక అధికారి తెలిపారు.

నేడు పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీ

ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఆర్‌డిఎ, పీడీ

ప్రతి నెలా చివర్లో పెన్షన్ సొమ్మును డ్రా చేసి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి పంపిణీ జరిగేది. అయితే మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియడంతో బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఇబ్బందులు ఏర్పడ్డాయి. బుధవారం మధ్యాహ్నం తర్వాత ఆర్‌బిఐ నుంచి బ్యాంకులకు పెన్షన్ సొమ్ము జమైంది. సచివాలయాల ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతుంది. ఇప్పటి వరకు 68,103 మంది పెన్షన్‌దారులకు రూ.20 కోట్లు పంపిణీ చేశాం. ఆర్‌బిఐ నుంచి ఆయా బ్యాంకులకు రూ.45.37 కోట్లు జమైంది. మిగిలిన రూ.23.55 కోట్లు గురువారం జమవుతాయి. పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీకి అన్నివిధాలుగా చర్యలు తీసుకున్నాం.

బెల్టుషాపు నిర్వహిస్తే జిల్లా బహిష్కరణ

తాడేపల్లిగూడెం రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చెన్నయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మద్యం బెల్టు షాపులను నిర్వహించే వారిపై అవసరమైతే ప్రివెన్షన్ యాక్ట్ వంటి కఠినమైన సెక్షన్లను అమలు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని తాడేపల్లిగూడెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి బుధవారం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది మద్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఏస్థాయి అధికారి అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాలంటీర్లు రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లడం, ప్రచారాల్లో పాల్గొనడంగాని చేయరాదన్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే వారిని ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులపై ఎవరైనా దౌర్జన్యంగా వ్యవహరిస్తే వారిని కఠినంగా అణిచివేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు చేసే బాధ్యత కార్యదర్శులు, విఆర్‌ఒలదేనన్నారు. సి విజిల్ యాప్‌పై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. 63 సమస్యాత్మక గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచేందుకు విలేజ్ సర్వైవింగ్‌లను నిరంతరం ఉంచేలా 13 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఎన్నికల కమిషన్ మరింత కఠినమైన నిబంధనలను అమలు చేస్తుందని, వీటిని అధికారులంతా కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనుమతి లేకుండా ప్రచారాలు నిర్వహించే వారిని కూడా పరిశీలించి అవసరమైతే కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం విక్రయించే పాత నేరస్తుల సమాచారం అందిస్తామని, వారిపై నిఘా ఉంచాలని ఆయన తెలిపారు. పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన పోలీస్ బలగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎం.మురళీకృష్ణ, ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఫుడ్‌ప్యాట్స్ కార్మికులు

వేతనాలు పెంచాలని ఫుడ్‌ఫ్యాట్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (3ఎఫ్)లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆ ఫ్యాక్టరీ కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల వేతనాలు పెంచి ఐదు సంవత్సరాలైందన్నారు. వేతన ఒప్పందం పూర్తయ్యి సంవత్సరం పూర్తయినప్పటికీ చర్చల పేరుతో యాజమాన్యం కాలయాపన చేస్తుందన్నారు. కార్మికుల పట్ల యాజమాన్యం మొండివైఖరి వీడి మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు తాడిపర్తి గణేశ్వరరావు, పెనుమాక శ్రీనివాసరావు, మాకా శ్రీనివాస్, ఎం.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

వృద్ధులు, వికలాంగుల ఇబ్బందులు

అందరికీ అందని పెన్షన్



తాడేపల్లిగూడెం రూరల్ : పింఛన్ కోసం ఎండలో వస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో బుధవారం సాయంత్రం వరకూ పింఛన్ల సొమ్ము పంపిణీ ప్రారంభం కాలేదు. ఉదయమే పింఛన్ సొమ్ము కోసం సచివాలయాలకు వెళ్లిన లబ్ధిదారులు బ్యాంకుల నుంచి సొమ్ము రాలేదని తెలిసి నిరాశతో వెనుదిరిగారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి సొమ్ము అందితే వెంటనే పంపిణీ ప్రారంభిస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఓ వృద్ధురాలు పక్కవారి సాయంతో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు పాతూరు సచివాలయానికి నడుచుకుంటూ చేరుకుంది. అయితే అక్కడ సొమ్ము సిద్ధంగా ఉన్నా సర్వర్ సక్రమంగా పని చేయక పంపిణీ ప్రక్రియ మందకొడిగా సాగింది. సచివాలయానికి రాలేని పరిస్థితుల్లో ఉన్నవారికి సిబ్బందే ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు.

పూలపల్లిలో ఇఒపిఆర్‌డి హైమావతి ఆధ్వర్యంలో కార్యదర్శి ఎల్.సత్యనారాయణ సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ సొమ్ము పంపిణీ చేశారు.

ఆచంట : బుధవారం మధ్యాహ్నం నుంచి ఇస్తామన్న పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు వికలాంగులు, ఆందోళనకు గురయ్యారు. 4వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోగులకు, వికలాంగులకు ఇంటి వద్దనే అధికారుల పింఛని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



గణపవరంలో పింఛన్ల కోసం వృద్ధుల ఎదురుచూపులు



ఆచంటలో పడిగాపులు

తాడేపల్లిగూడెం: స్థానిక 1, 2 వార్డుల సచివాలయాల వద్ద పెన్షన్ సొమ్ము కోసం వృద్ధులు ఎదురుచూశారు. ఉదయం ఎనిమిది గంటలకే లబ్ధిదారులు ఆయా సచివాలయా వద్దకు చేరుకున్నారు. అయితే సిబ్బంది రాకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పాత పరిస్థితి మళ్లీ తలెత్తిందని, ఇంకెన్నాళ్లు ఇలా పడిగాపులు పడాల్సి వస్తుందోనని వ్యాఖ్యలు విన్పించాయి.

ఉండి: పెన్షన్ సొమ్ము కోసం ఉదయం నుంచి సచివాలయాల వద్ద వద్దులు పడిగాపులు కాశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఉండే పరిస్థితి మళ్లీ పునరావృతమైందని లబ్ధిదారులు వాపోయారు. గురువారం నుంచి పింఛన్ల పంపిణీ సాగుతుందని సంబంధిత సిబ్బంది తెలిపారు.


పాలకొల్లు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో 60 శాతానికిపైగా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడిఒ అనుపమ

పెనుమంట్ర : పెన్షన్ల కోసం సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు ఎండ, వడగాల్పులతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నెలలో మూడు రోజులు గడచిపోయినా పెన్షన్ అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని పలువురు వికలాంగులు, వృద్ధులు తెలిపారు.

నరసాపురం : పట్టణంలోని పెన్షన్ దారులు ఆయా సచివాలయలకు ఉదయమే చేరుకున్నారు. మున్సిపల్ అధికారులు సచివాలయాల వద్ద టెంట్లను ఏర్పాటు చేశారు. సచివాలయం-14 వద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పార్క్ రోడ్డులోని కొప్పర్తి వేణుగోపాలరావు కాంప్లెక్స్‌లో పెన్షన్లు ఇవ్వటంతో పెద్దఎత్తున పించనుదారులు చేరుకున్నారు. సర్వర్ స్లోగా ఉండడంతో పెన్షన్ ఇవ్వడం ఆలస్యమవ్వడంతో పింఛనుదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నరసాపురంలో ఫించనుదారుల పడిగాపులు



సిబ్బందిని వివరాలు అడుగుతున్న ఎంఎల్ఎ నిమ్మల


సచివాలయాలకు అరకొర నిధులు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు : వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ సొమ్ము సచివాలయాలకు అరకొరగా జమ అయ్యాయని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని సచివాలయాలను ఆయన సందర్శించారు. ఆ పరిధిలో ఎంతమంది పెన్షన్ దారులు ఉన్నారని, ఎంత సొమ్ము వచ్చిందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయాలే గాని సచివాలయాల్లో ఇవ్వడం ఏంటన్నారు. మూడో తేదీ మధ్యాహ్నం నాలుగు గంటలకు పది శాతం నిధులు మాత్రమే సచివాలయాల్లో జమ అయినట్లు ఆన్‌లైన్ ద్వారా తెలుస్తుందన్నారు. ప్రభుత్వం వద్ద పెన్షన్ సొమ్ము పంపిణీకి నిధులు లేనందు వల్లే జాప్యం జరుగుతుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు 42 డిగ్రీల ఉష్ణోగ్రతలో సచివాలయాల వద్ద పంపిణీ చేస్తే వడదెబ్బ తగిలితే ప్రతిపక్షాలపై నెట్టాలనే దురుద్దేశమన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు చర్యలు

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య



ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ జాయింట్‌కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అధ్యక్షతన ధాన్యం కొనుగోలుపై జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలు, వ్యవసాయ, కోపరేటివ్ శాఖ, తూనికల, కొలతలు అధికారుల, జిల్లా రైస్ మిలర్స్ సంఘంతో కలిసి సంయుక్తంగా ఆయన సమీక్షించారు. జిల్లాలో రబీ సీజన్‌లో రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.2183, గ్రేడ్ - ఎ రకం క్వింటాకు రూ.2203 అందించి ధాన్యం సేకరణ లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా, రైతు భరోసా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం కొనుగోలుకు సరిపడా గోనెసంచులను మిల్లర్ల నుంచి ముందుగానే తీసుకుని సంచుల కొరత రాకుండా చూడాలన్నారు. జిల్లాలో ధాన్యం తరలించడానికి 2,600 వాహనాలను సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, జిల్లా ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా మేనేజర్ రంజిత్, జిల్లా తూనికుల కొలతల అధికారి వివి.నాగరాజు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్గోలో కుంభకోణం

నరసాపురం పాయింట్‌లో అవినీతికి పాల్పడిన ఉద్యోగి

ఆడిట్‌లో గుర్తించిన అధికారులు



నరసాపురం కార్గో పాయింట్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆర్‌టిసి డిపోలోని కార్గో పాయింట్‌లో ఉద్యోగి అవినీతి పాల్పడ్డారని పెద్దఎత్తున వార్తలు వినిపిస్తున్నాయి. ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో పాయింట్ ద్వారా వస్తువులు డోర్ డెలివరీ సేవలు అందిస్తున్నాయి. ఎంపిక చేసిన పట్టణాల్లో, నగరాల్లో పది కిలోమీటర్ల పరిధిలో ఆర్‌టిసి డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తుంది. డిపోలో 2019 నుంచి కార్గో సేవలందిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తణుకు, పాలకొల్లు, నిడదవోలు, తాడేపల్లిగూడెం కార్గో సేవలందిస్తున్నాయి. డోర్ డెలివరీ ఛార్జీలు వస్తువు దూరం, బరువు ఆధారంగా నిర్ణయిస్తారు. 2019కి మందుకు కండక్టర్ పనిచేసిన వ్యక్తి 2019 నుంచి కార్గోలో డిఎంఇగా పని చేస్తున్నారు. నరసాపురం నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాదు నుంచి నరసాపురానికి నెలకు బస్సు మూడు నుంచి నాలుగు సార్లు తిరుగుతుంది. వెళ్లిన ప్రతిసారి రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఆర్‌టిసి ఆదాయం వస్తుంది. వచ్చిన నగదు ఆరోజు లేదా మరుసటి రోజు జమ చేయాలి. కాని ఆ ఉద్యోగి అలా చేయలేదు. ప్రతి ఏడాది ఆడిట్ జరుగుతుంది. ఈ ఏడాది మార్చి చివర్లో జరిగిన ఆడిట్‌లో ఆ ఉద్యోగి బాగోతం బయటపడింది. పది రోజులుగా ఆడిట్ జరుగుతుందని, ఇంకా నాలుగైదు రోజులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విజయవాడ ఆర్‌టిసి కార్యాలయం నుంచి ఆడిట్ అధికారి విచారణ చేపడుతున్నారు. అప్రమత్తమైన ఆర్‌టిసి అధికారులు ఆ ఉద్యోగిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పటికే అతని వద్ద నుంచి కొంతమొత్తం నగదు రికవరీ చేసినట్లు సమాచారం. ఆడిట్ అధికారులు 2019 నుంచి పలు రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ కుంభకోణంలో ఇంకెవారిదైనా పాత్ర ఉందోమోననే కోణంలో విచారణ చేస్తున్నారు.

కార్గో సేవలో పెద్ద మొత్తంలో రూ.లక్షల్లో అవినీతి జరిగిందని, వందల లీటర్ల డీజిల్ కూడా పక్కదారి పట్టిందని ఆర్‌టిసి ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. సొమ్ము ప్రభుత్వ ఖాతాలో జమ కాకపోవడం, రికార్డ్స్ సక్రమంగా మెయింటైన్ చేయకపోవడం, సరైన సమయంలో నగదు జమ కాకపోవడంపై అధికారులు ఎందుకు ప్రశ్నించలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిధులు జమ కాలేదని ఆడిట్‌లో బయటపడింది

సత్తి సుబ్బన్నరెడ్డి, నరసాపురం డిపో మేనేజర్



ప్రతి ఏటా ఆడిట్ జరుగుతుంది. అవినీతికి పాల్పడితే ఉన్నతాధికారులు నివేదిస్తాం. నిధులు సక్రమంగా జమ కాలేదని ఆడిట్‌లో బయటపడింది. అతడిని విధుల నుంచి తాత్కాలికంగా తప్పించాం.

ఆర్‌ఆర్‌డిఎస్ కళాశాలకు సహకారం అందిస్తా

కాశీవిశ్వనాథరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరార్థం మౌలిక సౌకర్యాలు, కంప్యూటర్లు కావాలని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్యక్షులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజును కోరుతూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.ప్రసూన బుధవారం వినతిపత్రం అందించారు. స్పందించిన విశ్వనాథరాజు మాట్లాడుతూ తన కుమారులు జోగి ఆనంద్‌వర్మ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి చెప్పారు. ఉద్దరాజు అనందరాజు ఫౌండేషన్ విద్యాప్రోత్సాహం అందించడం అభినందనీయమని కళాశాలలో బుధవారం నిర్వహించి సమావేశంలో కళాశాల స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.ప్రసూన మాట్లాడుతూ కళాశాలకు కావాల్సిన సౌకర్యాలపై రంగసాయిని సంప్రదించామని, ఆయన దాతల ద్వారా రూ.రెండు లక్షలు ఇప్పించారని, కంప్యూటర్లు దాతల ద్వారా ఏర్పాటు చేస్తున్నారని, ఆ రూమ్‌లకు ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ పేరు పెడతామని చెప్పారు. ఈ సమావేశంలో పీడీ ఎస్.ధనుంజయ, లైబ్రేరియన్ నరసింహమూర్తి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

స్వీప్ జిల్లా సమన్వయకర్త ప్రభాకరరావు

వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు



మానవహారంలో విద్యార్థులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఎన్నికలంటే పౌరులకు ఒక పండగ వంటిదని, మన ఇంట్లో పండగకు మనల్ని ఎవరూ పిలవరని, అదే రకంగా ఎన్నికల పండుగకు కూడా ఎవరికి వారే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావాలని స్వీప్ జిల్లా సమన్వయకర్త ప్రభాకరరావు అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం ఓటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రభాకరరావు మాట్లాడుతూ ఓటర్లు కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి అవసరమన్నారు. అందుకోసం యువత నడుం బిగించాలన్నారను. వారు ఓటు వేయడమే కాకుండా కుటుంబీకులను, తల్లిదండ్రులను కూడా ప్రోత్సహించాలన్నారు. ఓటుకు తీసుకునే డబ్బు సంవత్సరంలో తాగే టీ ఖరీదు ఉండటం లేదని గుర్తుంచుకోవాలన్నారు. ఓటు వేసే వారి సంఖ్య ఇంకా పెరగాల్సి ఉందన్నారు. ఇప్పటికే 82 శాతం పోలవుతోందని, మరొక పది శాతం కలవాల్సి ఉందన్నారు. అందుకు విద్యార్థులు స్పందించాలన్నారు. ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఓటరు తను వేసే ఓటు ఎవరికి పడిందో కూడా చూసుకోవచన్నారు. డిజిటల్ ఓట్లన్నీ ఒకరికే పడతాయన్న వాదన సరికాదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి విధాతలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, శ్రీ చరణ్, కళాశాల జాతీయ విభాగం అధికారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

35 మంది విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - నరసాపురం

ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి మూడు నెలలకోకసారి రక్తదానం చేయడం మంచిదని నరసాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎన్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 15 మంది బుధవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సుప్రియ మాట్లాడుతూ 18 నుంచి 60 ఏళ్ల లోపు మధ్య ఉన్న ఆరోగ్యవంతమైన వారు రక్తదానం చేయవచ్చన్నారు. 45 కిలోల లోపు బరువుంటే రక్తదానం చేయకూడదన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను సుప్రియ అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ స్టోరేజ్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గరీమా, ఆర్ఎంఒ డాక్టర్ నళిని, డాక్టర్ రామకృష్ణ, జి.జేసుప్రసాద్, వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.సాయిబాబా, జి.రామకృష్ణ, ఎస్.యాకోబు పాల్గొన్నారు.


గణపవరం : పింఛన్లు అందిస్తున్న సిబ్బంది

నరసాపురంలో 80.85 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

పింఛన్ల పంపిణీలో నరసాపురం అర్బన్ జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. బుధవారం రాత్రి ఏడు గంటల సమయానికి 80.85 శాతం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో 5806 మందిలో 4681 మందికి రూ.1,41,19,000 పింఛన సొమ్ము పంపిణీ చేశామని చెప్పారు. మండలంలోని 28 పంచాయతీల్లో 11,326 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ ఎంవి.రమణరావు తెలిపారు.

పింఛన్లు అందజేత

గణపవరం :మండల కేంద్రమైన గణపవరం నాలుగు సచివాలయాల్లో బుధవారం సాయంత్రం లబ్ధిదారులకు పెన్షన్లు అందించారు. ఉదయం నుంచే పెన్షన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాసి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో ఎండ తీవ్రత వల్ల కలిగే వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగపడుతుందని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు అన్నారు. స్థానిక బస్టాండ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ జింక్ కార్నర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల కలిగే వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ఉపయోగపడుతుందన్నారు. వేసవిలో స్వచ్ఛమైన నీరు తాగకపోవడం వల్ల కలిగే విరేచనాలు, వాంతులకు కూడా ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌టిసి ప్రయాణికులందరూ బస్టాండ్‌లో ఉచితంగా అందించే ఓరస్ ద్రావణాన్ని తీసుకుని ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ సిహెచ్.పద్మజ, ఎంఎల్‌హెచ్‌పి నున్న పాప, ఎఎన్ఎం ఎం.ప్రేమలీల, ఆశాలు జి.జ్ఞానరత్నం, ఆరోగ్య కార్యకర్త ఎ.కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు ఓఆర్ఎస్ అందిస్తున్న వక్తలు

తాడేపల్లిగూడేన్ని అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి మార్నీడి బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి మార్నీడి బాబ్జి అన్నారు. తాడేపల్లిగూడెంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రజలందరికీ సేవ చేయాలనే ఉద్దేశంతో రెండోసారి కాంగ్రెస్ తరపున తాడేపల్లిగూడెం అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే ప్రత్యేక హోదా తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతన్న పివిఎల్.నరసింహరాజు

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం చిన్నపేట ప్రాంతానికి చెందిన టిడిపి, జనసేన మహిళ నాయకులు, కార్యకర్తలు సుమారు వంద మంది బుధవారం వైసిపిలో చేరారు. స్థానిక చిన్నపేటలో వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనం తరం చిన్నపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ వైసిపికి ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. సంక్షేమం అభివృద్ధికి వైసిపి నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో వైసిపి గెలుపునకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), ఉండి ఎఎంసి ఛైర్మన్, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మీతులసి, వెంకటేశ్వరరావు, సర్పంచి జంగం సూరిబాబు, ఉప ఎంపిపిలు ఆదాడ లక్ష్మీతులసి, నరేష్, క్యాప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, జాబత్తుల రవి, రంగారావు పాల్గొన్నారు.

చిల్లర పండ్ల వర్తకులకు అండగా ఉంటా

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రోడ్డు మీద వ్యాపారం చేసుకుని జీవించే చిల్లర పండ్ల వర్తకులకు తాను రక్షణ కవచంలా ఉంటానని వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన చిల్లర పండ్ల వర్తక సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను వ్యాపారంలో బాగా సంపాదించి ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తాను సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధికి, శాంతి భద్రతలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ పండ్ల వ్యాపారి, వైసిపి సీనియర్ నాయకులు, 15వ వార్డు ఇన్‌ఛార్జి మార్నీడి వెంకన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, చిల్లర పండ్ల వర్తకులు పాల్గొన్నారు.

నేడు భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్డులో నూతనంగా ప్రారంభించిన శ్రీ దత్త సాయి మందిరంలో ప్రతి గురువారం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు శెట్టి మోహన్‌రావు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు ఆయన బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీలో దొంగల భయం

ఇసుక, సిమెంట్, ఐరన్, వాటర్‌మోటార్లు దొంగిలిస్తున్న కేటుగాళ్లు

ఆందోళనలో కాలనీవాసులు

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న కాలనీలు కేటుగాళ్లకు అడ్డగా మారాయి. కాలనీలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్, వాటర్ మోటార్లు ఇలా గృహ నిర్మాణానికి సంబంధించి ఏ సామగ్రి దొరికినా మాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీవాసులు దొంగల భయంతో ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం పాలకోడేరు గ్రామంలో వాటర్ ప్లాంట్ సమీపాన ఉన్న జగనన్న కాలనీ వాసులను దొంగల బెడద వెంటాడుతుంది. నానా తంటాలు పడి ఇంటిని నిర్మించుకుంటున్న నేపథ్యంలో నిర్మాణ సామగ్రిని ఎవరూ లేని సమయంలో కేటుగాళ్లు మాయం చేస్తున్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్, వాటర్ మోటార్లు సైతం దొంగిలిస్తున్నారు. ఒక పక్క కాలనీకి వెళ్లేందుకు దారి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుంటే ఇదే అదునుగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. మంగళవారం రాత్రి రెండు గృహాలకు చెందిన విద్యుత్తు మోటార్లను దొంగలించకపోవడంతో కాలనీవాసులు లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మోటార్ దొంగిలించిన ప్రదేశం

బిజెపిని గద్దె దించడమే ఆనందరావుకు నివాళి

ప్రథమ వర్థంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - వీరవాసరం

వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దించడమే సిపిఎం సీనియర్ నేత ఆనందరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆనందరావు ప్రథమ వర్ధంతి సభ మత్స్యపురిపాలెం గ్రంథాలయం సెంటర్‌లో సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత ఆనందరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ వీరవాసరం మండలం రైతు వ్యవసాయ కార్మిక పోరాటాల్లో ఆనందరావు చురుగ్గా పాల్గొనేవారన్నారు. 1966 నుంచి తుది శ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిలబడిన వ్యక్తి ఆనందరావు అని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ నేతల ఆనందరావు ప్రజా సమస్యలపై పోరాడే సందర్భంలో పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ధైర్యంగా నిలబడ్డారన్నారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపి కూటమికి వ్యతిరేకంగా లౌకిక పార్టీలను గెలిపించడమే ఆనందరావుకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రైతు సంఘం నాయకులు బాలం విజయకుమార్, వృత్తి సంఘాల నాయకులు యండమూరి సుబ్బారావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఆశ్రియ్య, మండల నాయకులు జి.శ్యామ్ బాబు, కేత జ్యోతిబాస్, యార్ల బండి నారాయణమూర్తి, బొర్రా అలమహారాజు, రెడ్డి రామారావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆనందరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి నుంచి పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు నాలుగో తేదీ గురువారం నుంచి పెన్షన్ పంపిణీ చేస్తామని ఎంపిడిఒ శ్రీనివాస్‌దొర తెలిపారు. మండలంలోని 20 సచివాలయాల్లో 9015 మందికి పెన్షన్ కింద రూ.2.65 కోట్లు అందిస్తున్నామని చెప్పారు. పెన్షన్‌దారులు తమ పరిధిలోని సచివాలయం వద్దకు వెళ్లాలని, ఉదయం ఏడు గంటల నుంచి సచివాలయం సిబ్బంది పెన్షన్ అందిస్తారని తెలిపారు.

వాండ్రంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఉండి

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వాండ్రం గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకటతాతనాయుడు అన్నారు. మండలంలోని వాండ్రం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్డు వెంకట తాత నాయుడు మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ రైతులు, కార్మికులు, వాహనదారులు ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకుని సేద తీరాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి సైదాడ చిన్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - నరసాపురం

కుల, మత, ప్రాంత, పార్టీ బేధం లేకుండా అందరికీ అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ఎల్‌బి.చర్ల గ్రామంలో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ప్రసాదరాజు, ఆయన కుమారుడు శ్రీకృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమాని నాగరాజు, బర్రి శ్రీవెంకటరమణ, దొంగ మురళీకృష్ణ, షేక్ మెంటు మస్తాన్ పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండిని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే అవకాశం ఇవ్వాలని ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని చినపుల్లేరు, పెదపుల్లేరు, వాండ్రం, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోకసారి తనకు ఎంఎల్ఎగా అవకాశం కల్పించాలని కోరారు. తను ఇప్పటికే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మోపిదేవి నాగ శ్రీనివాసరావు, బురిడి రవిబాబు, పున్నం నాగేశ్వరరావు, దవిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమవరం శివారు ప్రాంతాలకు తాగునీరందించాలి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం శివారు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ భీమవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి దండు శ్రీనివాసరాజు కోరారు. ఎల్‌జిపాడు పరిధిలో కొత్తపూసలమురు, దొంగపిండి, లోసరి, నాయుడుపాలెం, బర్రెవానిపేట, తోకతిప్పతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. మంచినీటి చెరువుల్లో నీరు పసర్లెక్కి తాగడానికి పనికి రాకుండా ఉన్నాయని విమర్శించారు. గ్రామస్తులు ఆ నీటిని తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి తాగునీటి సమస్య ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీరందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని దారుణమన్నారు. వేసవిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని, ఇందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. పాలకోడేరు, కుముదవల్లి, కోరుకొల్లు గ్రామాల్లో పాలకోడేరు పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై ఎవరు ఎటువంటి అపోహలకు పోకుండా ఉండాలని అవగాహన కల్పించారు. ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలకు పోలీసులు ఎప్పుడూ తోడుంటారని భరోసా కల్పించారు. ప్రజలు అధైర్య పడకుండా రాజ్యాంగం ద్వారా సంక్రమించిన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శక నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీసులు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతులో పోలీసులు

6 నుంచి రైల్వే వారోత్సవాలు

భీమవరం రూరల్:ఈ నెల ఆరో తేదీ నుంచి శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత రైల్వే వారోత్సవాల బ్రోచర్‌ను టౌన్ రైల్వే స్టేషన్ ఎస్ఎం కె శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రైల్వే వ్యవస్థ ప్రపంచంలోనే ఒక ప్రముఖ స్థానం సంతరించుకుందని, గత 32 ఏళ్లుగా భీమవరంలో రైల్వే వారోత్సవాలను నిర్వహి స్తున్నామని చెప్పారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకు రైల్వే వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, రైల్వే వ్యవస్థపై విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తామని, పదో తేదీ నుంచి రైల్వేస్టేషన్‌లో అవగా హన సదస్సులు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 16వ తేదీన ముగింపు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే టిటిఐ ఎ వివేక్ బాబు, ప్యాడి మర్చంట్ అసోసియేషన్, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థికి బిసి సంఘాల మద్దతు

బిసి సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటాచార్యులు

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు 20 బిసి సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సురవరపు వెంకటాచార్యులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఉమాబాలను బిసి నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఫ్యాన్ గుర్తును బహూకరించి తమ మద్ద తును ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటా చార్యులు మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సోదరులం దరూ పార్టీలకు అతీతంగా ఉమాబాల, అసెంబ్లీల అభ్యర్థులకు గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం ఉండి నియోజక వర్గ ఇన్‌ఛార్జి మన్నె నాగరాజు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు బాలం తులసి వెంకటేష్, వైసిపి యువజన విభాగం మండలాధ్యక్షులు బొక్క శ్రీనివాస్, రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి వీర మల్లికార్జునుడు, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ నాయ కులు పెద్దపుడి దేవుడు, ఏడుకొండలు పాల్గొన్నారు.

అక్రమ ప్రమోషన్లపై విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆచంట

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖలో అనర్హులకు ప్రమోషన్లు ఇవ్వడం, అక్రమంగా ప్రమోషన్ పొందిన అయినవల్లి ఇఒ సత్యనారాయణ రాజును సస్పెండ్ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, గేదెల ధనుష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దేవాదయ ధర్మదాయ శాఖలో అక్రమ ప్రమోషన్ల వ్యవహారంపై నిజానిజాలు బయట పెట్టాలన్నారు. సీనియారిటీ లిస్టు ఖాతర్ చేయకుండా జిఒ 888ను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ప్రమోషన్ ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. అర్ధరాత్రి ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలని, అప్పటివరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అయినవల్లి ఇఒ సత్యనారాయణను సస్పెండ్ చేయాలన్నారు. హైకోర్టు స్వయంగా సత్యనారాయణరాజు ప్రమోషన్ అక్రమాన్ని తేల్చిన తర్వాత కొనసాగించడం సరికాదన్నారు. అక్రమ ప్రమోషన్ల వ్యవహారంలో సీనియారిటీ ఉన్న ఉద్యోగులకు, దశాబ్ద కాలంగా పనిచేస్తున్న చిన్న ఉద్యోగులకు నష్టం కలుగుతుందని తెలిపారు.

ఎంఎల్ఎ పదవి అంటే ఒక బాధ్యత

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎంఎల్ఎ పదవి అంటే అలంకారం కాదని, ఒక బాధ్యత అని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రెండో పట్టణంలోని 34 వార్డులో గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడిస్తూ ఆ వార్డు ప్రజలు బుధవారం రాత్రి ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 58 నెలల కాలంలో పట్టణంలో సుమారుగా రూ.వంద కోట్లకు పైబడి నిధులు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రతి వార్డులో కూడా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యిర్రింకి పద్మనాభం, బొండాడ శ్రీరాములు, తటవర్తి కృష్ణ, చంద్రరావు, కమ్మిల సూరిబాబు, పాపోలు పాలశేషు, అభిరుచి రఘు పాల్గొన్నారు.

27వ వార్డులో గుడాల గోపీ ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 27వ వార్డు బద్దావానిపేటలో వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, రాష్ట్ర కార్యదర్శి దత్తాత్రేయవర్మ, మైకేల్‌రాజు, సాయి బాలాజీ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.పెద్దిరాజు, జెసిఎస్ కన్వీనర్ మోర్తా గిరీష్, గంటా నరేష్, వెంకటేశ్వర ఆలయ ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, గంటా వెంకన్న, పిల్లా అప్పాజీ, పాలపర్తి కృపారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబందుల్లేకుండా చూడాలి

విఆర్ఒ, ఆర్‌బికె సిబ్బందికి వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదేశాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ధాన్యం కొనుగోలుపై రైతులకు అసౌకర్యం కలుగుకుండా ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విఆర్ఒలు, ఆర్‌బికె సిబ్బందితో బుదవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఇ క్రాప్‌లో నమోదైన వివరాల మేరకు ఆర్‌బికె సిబ్బంది నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. ధాన్యంలో నాణ్యత లోపిస్తే ఎలా మెరుగుపర్చుకోవాలో వివరించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎవిఎస్.భాస్కరరావు, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు ఉన్నారు.

ఓడూరులో వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని ఓడూరు గ్రామ సచివాలయం వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను గ్రామకార్యదర్శికి అందించారు.

'అభివృద్ధిని చూసి ఓటేయండి'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడుకు ఓటేసి గెలిపించాలని ఆయన సతీమణి సూర్యకుమారి కోరారు. పట్టణంలోని 18, 20 వార్డుల్లో ఆమె బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు ప్రెసిడెంట్ శివన్నారాయణ, మల్లుల వెంకట్, పసుపులేటి జేమ్స్, టిడిపి పట్టణ అధ్యక్షులు జివి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి పాల్గొన్నారు.

పాతపాడులో 'మనకోసం మన నాయకర్'

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరటం ఖాయమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని పాతపాడులో మనకోసం మన నాయకర్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారంలో నాయకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, అందే దొరబాబు, ఒడుగు ఏసుబాబు, ఉప్పులూరి రాంబాబు, వాతాడి ఉమ, గుబ్బల నాగరాజు, మల్లాది గంటయ్య, రమణి నరసింహస్వామి, బసవాని రెడ్డియ్య పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన పార్టీ పట్ల ప్రజల ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కెపిపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యులు అందే దొరబాబు ఆధ్వర్యంలో సుమారు 50 మంది జనసేనలో చేరారు. వారికి నాయకర్ పార్టీ కండువాకప్పి సాదారంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, బొమ్మిడి సునీల్, కొల్లాటి గోపీకృష్ణ, బందెల రవీంద్ర, వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, నిప్పులేటి తారకరామారావు, వట్టిప్రోలు సతీష్, బందెల ఎలీషా, ఉప్పులూరి రాంబాబు, అందే జగదీష్ పాల్గొన్నారు.